# అప్పారావుగారి పంచదార మాత్రలు

**శ్రీ ఆరుద్ర**

"అభిరుచి, గుణదోష నిశ్చయ జ్ఞానము వున్న రచయిత ఒక కావ్యాన్ని రచియిస్తున్నప్పుడు అతని సృజన, విమర్శనాత్మక శక్తులు రెండూ కుడి ఎడమలుగా ఆ కావ్యసృష్టిని కొనసాగిస్తాయి. భావ భావోద్వేగ పాత్ర సన్నివేశాదులను మేధ సృష్టిస్తూవుంటే వాటికి విమర్శనాత్మక శక్తి గీటుపెట్టి కొన్నిటిని స్వీకరిస్తుంది. కొన్నిటిని తిరస్కరిస్తుంది.

"ప్రతిభాక్షేత్రం ఒక టంకసాల వంటిది, రచయిత సృష్టించేవి, అందు తయారయే నాణెముల వంటివి. టంకసాల తయారుచేసిన నాణెములు చెల్లునో చెల్లవో మోగించి చూసినట్లు వీటిని విమర్శనాత్మక శక్తి ఉపాదేయములగునో కావో పరీక్షిస్తుంది."

ఇవి గురజాడ అప్పారావుగారి మాటలే. ఈ దృక్పథంతోనే వారు కన్యాశుల్కాన్ని తిరగ వ్రాశారు. ఆ నాటకంలోని ప్రతి చిన్న పాత్రనీ, ఆయన అసమాన విమర్శనా శక్తి పరీక్షించి 'ప్యాసు' చేసింది. వారి వివేచనాశక్తి సమకాలిక జీవితాన్ని వేయికన్నులతో పరిశీలించింది. అణువణువునూ అవగాహన చేసుకుంది. "చిన్న తనములో బొమ్మలాట నేర్చివుండుటచేత లోకమనే రంగంలో చిత్రకోటి రీతులను ఆటాడే మనుష్యులనే పాత్రముల సొగసునే కనిపెట్టడము" వారికి అలవాటైనది. "సొగసులేని మనిషే వుండడు. స్నేహమూ ప్రేమా అనే అనాది అయిన్నీ యెప్పటికీ సరికొత్తగా ఉండే రెండు వెలుగులను నరుని మీద తిప్పి కాంచితే వింత సొగసులు బయలుదేరుతవి. అసూయ అనే అంధకారంలో అంతా ఏక నలుపే" అనే సువిశాల దృక్పథంలో రెండు చేతులా రెండు వెలుగులను పట్టుకొని వాటిని తను చుట్టూతావున్న సమాజంపై ప్రసరింప జేశారు. కోటి సొగసులు వీక్షించి వాటినే చిత్రించారు.

అందుకే కన్యాశుల్కంలో సొగసులేని పాత్రే ఉండదు. అందులోని ప్రతిఒక్కరితో గ్రంథకర్త స్నేహంచేసుకొన్నాడు; ప్రేమించాడు. వాళ్ళందరినీ మనకు ప్రేమాస్పదులను కావించాడు. వాళ్లు జీవిస్తున్న సమాజం దుర్గంధ భూయిష్టమైనా వాళ్ళందరూ పారిజాత పరిమళాలు వెదజల్లుతారు. వాళ్ళలో కొందరు చేసేవి నీచకృత్యాలైనా ఆవిధంగా వాళ్ళెందుకు ప్రవర్తింపవలసి వచ్చిందో తెలుసుకొనడంవలన, ఆత్మరక్షణకోసం చేసేది అపరాధంకాదనే నిర్ణయానికొచ్చి ప్రతి ముద్దాయినీ

మనం విడుదల చేస్తాం. నిజమైన సాహిత్యం నేరారోపణ చేయనివ్వదు.

అయితే సిసలైన కార్యకర్తకు ఒక బాధ్యత లేకపోలేదు. వ్యక్తులపైన ద్వేషం పుట్టించకుండానే ఆ యా వ్యక్తులు ఏ సాంప్రదాయాలకు బానిసలో, ఏ సంస్కారాలకు వారసులో, ఏ బలహీనతలకు బంధితులో, ఏ ఛాందసాలకి బలిపశువులో చెప్పాలనే తహతహ బాధ్యతాయుతమైనదే. నిమిత్తమాత్రమైన ఒక సన్నివేశాన్ని తీసుకొని, దానికి కారణభూతులైనవాళ్ళ కేసు హిస్టరీలు తయారుచేసి, ఆ సంఘటన మీదుగా సంకీర్ణ యితివృత్తాన్ని అల్లి, వాస్తవాన్ని కావ్యంగా మార్చి, కావ్యాన్ని జీవితం లాగ భ్రమింప జేయడం, ప్రథమశ్రేణి రచయితకే సాధ్యమవుతుంది. ఆధునిక యుగంలో ఇటువంటి పని చేసినవారు గురుజాడ అప్పారావుగారొక్కరే. ఇతరులెవరూ అలాచేయలేదనే వారి బాధ.

“పుష్కలమైన, అనంతమైన సంఘటనలతో నిండివున్న, ఎంతోగాంభీర్యమూ, వైవిధ్యమూగల నేటి జీవితాన్ని వీక్షించక, ప్రపంచ ప్రపిద్ధికెక్కిన ప్రాచీన కాల్పనిక కథలనుంచి రచయితలు యితివృత్తాలను ఎందుకు స్వీకరిస్తారో అర్థం కాక నాకు ఆశ్చర్యం వేసింది. ఈ కారణాలవల్ల నేను వాస్తవిక జీవితంనుంచి సమకాలిక యితివృత్తాన్ని స్వీకరించి దానిని తెలుగున వాడుక భాషలో నాటకంగా రూపొందించాను” అని అప్పారావుగారే వ్రాసుకున్నారు.

వారు వీక్షించిన వాస్తవిక జీవితమేమిటి ? ఈ ప్రశ్నకి ఒక్కమాటలో జవాబు చెప్పడానికి వీలులేదు. అర్వాచీనుడైన శ్రీశ్రీ తన ‘కవితా ! ఒకవితా !’ అనే కావ్యంలో ఎటువంటి దృశ్యాలు చూశాడో ప్రాచీనులయిన అప్పారావుగారూ అలాంటివే చూచారు. తరతరాల క్రిందటి మహాకవి శూద్రకుడు ‘మృచ్ఛకటిక’ వ్రాసేముందు ఏ విధమైన కళ్ళతో చూచాడో అటువంటి వాటితోనే అప్పారావుగారు చూశారు. నోరులేని వాళ్ళను నోరున్నవాళ్ళూ, తెలివిలేని వాళ్ళను తెలివున్నవాళ్ళూ, చదువురాని వాళ్ళను చదువుకున్నవాళ్ళూ తమ తమ స్వార్థానికి ‘దోచు’ కొనడం కళ్ళారా చూశారు. ముక్కుపచ్చలారని పసివాళ్ళనే కాక, పుట్టని ఆడపిల్లలను కూడా కూరగాయల బేరంలాగ బేరమాడి కోనుక్కోడం, అమ్ముకోడం, దయాదాక్షిణ్యాలు లేని తండ్రుల చేతులారా బాల్యవితంతువుల ఉత్పత్తి, వాళ్ళ దాయాదులపైన దావాలూ, దొంగ జాతకాలూ, తప్పుడు సాక్ష్యాలూ, చిన్నసైజు కుట్రల పర్యవసానముగా పెద్దలెక్కన బీభత్సాలూఒక్క మూర్ఖుడి మంకుతనంతో కొన్నిడజన్ల జీవితాలలో కల్లోలం, ఒక్క దురాచారంతో సంఘానికి పట్టినదౌర్భాగ్యం అప్పారావుగారు తడికళ్ళతో వీక్షించారు. పొడికళ్ళతో విరచించారు.

కన్యాశుల్క మనే దురాచారం ఆనాటి బ్రాహ్మణసంఘంలో మాత్రమే ఉండేది. అయితే దాని విషవాయువులు సమాజంలో అన్నివర్గాలనూ ఉక్కిరిబిక్కిరి చేశాయి. అప్పారావుగారి బ్రాహ్మణేతర పాత్రలన్నీ ఆ సంకీర్ణ యితివృత్తపు పద్మవ్యూహంలో చిక్కుకున్న వాళ్ళే. మృచ్ఛకటికలోని రాజకీయ విప్లవంలాగ కన్యాశుల్కంలో సాంఘిక అవినీతి అంతర్లీనంగా ఉంది. రెండు నాటకాలలోనూ అవి చిట్టచివర తమ బృహద్రూపాన్ని ప్రదర్శిస్తాయి. స్వయంకృతాపరాధాలు చేస్తున్న సమాజాన్ని చూస్తే ఏ మహాకవికైనా నవ్వూ జాలీ జమిలిగా జనిస్తాయి. అందులోని వ్యక్తులందరూ అర్భకుల మాదిరిగానే కనిపిస్తారు. వాళ్ళ రుగ్మతకి

యివ్వవలసినవి పంచదార పూసిన చేదుమాత్రలు. ఈమధ్య నొక పాశ్చాత్య రచయిత "నే నిచ్చే పంచదార పూసిన మాత్రలలో మాత్రలవల్ల ఇబ్బందేం లేదు. పంచదారమాత్రం గరళంలాంటిది" అన్నాడు. అలాగే అప్పారావుగారు నాటకానికి హాస్యమనే పంచదార పూశారు. అది అక్షరాలా గరళం లాంటిదే. అందుకే ఆయన "నే నెంత హాస్య ప్రసన్నుడనో, 'అంత గంభీరుడను; భయంకరుడను" అని చెప్పుకున్నారు. ఈ భయంకరుని మంత్ర దండంతో మంచిచెడ్డలు వేటి కవి విడిపోక తప్పదు.

కాని, లోకమందలి మంచి చెడ్డలు లోకులు ఎరుగరని అప్పారావుగారికి తెలుసు. ఉత్తమ సాహిత్య దర్పణంలోనే తప్ప సమాజం తన ఉత్తమాంగాన్ని వీక్షించలేదు. పాత్రలలో 'నున్న లోపాలూ, ప్లాటుకి వీలయిన పరిస్థితులూ సమాజం ముఖంమీద నున్న జిడ్డుమరకలు; నల్లమచ్చలు. అద్దంలో నీ ముఖం నువ్వే చూసుకొని మచ్చలు తుడుచుకో మంటుంది మంచి సాహిత్యం.

ఒకరకంగా చూస్తే కన్యాశుల్కం సైకియాట్రిస్టు సోఫా వంటిది. ప్రతి పాత్రా దానిపైన తీరిగ్గా శయనించి తన మనసులోని నిగూఢ రహస్యాలను అవ్యక్తంగానే స్పష్టం చేస్తుంది; ఆరోగ్యసీమలకు పయనిస్తుంది కొన్ని రుగ్మతలు నయం కాకుండానే నాటకం ముగుస్తుంది. ఎన్నటికయినా ఆ రోగాలు కుదురుతాయనే నమ్మకం మాత్రం కలుగుతుంది.

కన్యాశుల్కంలో చిన్నా పెద్దా అన్నీ కలసి ముప్ఫయి ఎనిమిది పాత్రలున్నాయి. ఇవి రంగం మీదకి వచ్చేవి. రంగం మీదకి రాని పాత్రలు, కనిపించని పాత్రలు తండోపతండాలు. గిరీశం ప్రేమలేఖ వ్రాసిన వెంకుపంతులుగారి కోడలు, మధురవాణిని ఉంచుకున్న డిప్టీకలక్టరుగారి కుమార రత్నం, రామప్పంతులు వెధవ అప్పగారు, బుచ్చెమ్మ స్నేహితురాలైన రాంబొట్లు గారి అచ్చెమ్మ, ఖూనీకేసులో పొడ్డుని నానా బాధలూ పెట్టిన ఇన్స్పెక్టరూ, ఇలాంటి వాళ్ళెందరో ఉన్నారు. కన్యాశుల్కంలోని సొగసేమిటంటే దానిని శ్రద్ధగా చదివిన వాళ్ళు ఆ పాత్రల జీవితచరిత్రలను రమారమి సంపూర్ణంగా వ్రాయవచ్చు. ఆధునిక నాటకాలలో ఉండకూడని స్వగతాలు ఉండడం వలన పాత్రల ఆంతర్యంకూడా బోధపడుతుంది. ఒకొక్క పాత్రలోని సొగసులు చూపించాలంటే ఒకొక్క పుస్తకమే వ్రాయాలి. ముఖ్యపాత్రలని పరిశీలించి, వాటిపట్ల అప్పారావుగారి ఉద్దేశం, ఫిలాసఫీ సందేశం ఏమిటో గమనించడమే ప్రస్తుతానికి వీలైనది.

కన్యాశుల్కంలో మధురవాణి, గిరీశం మరపురాని పాత్రలు. కరటక శాస్త్రి, రామప్పంతులూ మరచిపోకూడని వ్యక్తులు. లుబ్ధావధాన్లూ, అగ్నిహోత్రావధాన్లూ గుర్తుపెట్టుకోవలసిన ఛాందసులే కాక అప్పారావుగారు తీసుకున్న సమస్యకి కారణభూతులు. బుచ్చమ్మా, మీనాక్షీ సాంఘిక దురాచారానికి ఆహుతైన అమాయిక స్త్రీ మూర్తులు. వెంకటేశం, మహేశం (కరటక శాస్త్రి శిష్యుడు) ఆనాటికి భావిపౌరులు.

ఈ పాత్రలని సృష్టించి, సజీవంగా చిత్రించి, అప్పారావుగారు నాటకాన్ని నడిపించారు. పాత్ర పోషణ అనన్యంగా సాగబట్టే ఏ ఒక్కరినీ విస్మరించలేనంత స్థిరంగా ఆ మూర్తులు నిలచి పోతున్నారు. అయితే మధురవాణిగాని, గిరీశంగాని అప్పారావుగారు తీసుకొన్న సమస్యకు అనవసరం. కన్యాశుల్కమనే దురాచారాన్ని ఖండించడమే ప్రధానమైతే ఈ పాత్రల ప్రమేయమే లేదు. అందుకే కన్యాశుల్కం మొదటి కూర్పులో మధురవాణి పాత్రకు ఏ వన్నెలూ, చిన్నెలూ

లేవు. నాటక ప్రదర్శనలో సైడుకర్టెను కున్నంత ప్రాముఖ్యం కూడా మొదటి మధురవాణికి లేదు. రెండవ కూర్పు నాటికి అప్పారావు గారి రచనాశిల్పం పరిణతమైంది. సమకాలిక ఇతి వృత్తాన్ని సార్వజనీకం చేయాలనే తహతహతో తిరగవ్రాశారు. నాటక రచనా రహస్యాలు బాగా తెలిసినవారు కాబట్టి మధురవాణి పాత్రను పెంచి ముఖ్యపాత్రలను, కీలుబొమ్మలనుచేసి సూత్రాలను మధురవాణి చేతుల్లో పెట్టారు. ప్లాటులో యింత ప్రాముఖ్యం లేకపోతే పాత్ర రాణించదు. ఆమె ఆడించినట్టే అన్ని పాత్రలూ ఆడుతాయి. ఈ మాటలు కరటకశాస్త్రిచేత చెప్పించారు. మధుర వాణితో అతను "నువ్వు ఆ గ్రామం గ్రామం సమూలం రాణీలాగ యేలడం నేను యీ కళ్ళతో చూడలేదా ?" అంటాడు. పాఠకులూ అదే చూస్తారు.

మధురవాణి పాత్రను అప్పారావుగారు జీవితంలోనుంచే తీసుకున్నారు. అయితే అది ఏ ఒక్క వ్యక్తికి ఫొటోగ్రాపు కాదు. ఉన్న దున్నట్టు చూపించే పాత్ర కాదు. ఉండవలసిన ఔన్నత్యాన్ని అందుకొన్న ఆదర్శమూర్తి. అప్పారావుగారే ఒక దగ్గర ఇలా వ్రాశారు: "రచయిత తాను రూపొందించే పాత్రల నన్నింటినీ జీవితంనుంచి పరిగ్రహించడు. పరిగ్రహించిన పాత్రలను అచ్చంగా పరిగ్రహించినట్లుగానే చిత్రించడు. వెనుకటి కవులు నిర్మించిన భావనాత్మకమూర్తుల లక్షణములు, అతనికి తెలియకుండానే అతనిలో ద్యోతకమౌతాయి" ఇది మధురవాణి పాత్రలో అక్షరాలా నిజం.

ఆ పాత్రని ప్రవేశపెడుతూనే అప్పారావుగారు ఆణిముత్యం లాంటి వాక్యం చెప్పించారు. "మొగవాడికయినా ఆడదానికయినా నీతి వుండాలి" అని మధురవాణి నోరు తెరవగానే చెప్తుంది. ఇదే ఆ పాత్రలో ఆయువుపట్టు. నాటకంలో ఆసాంతం ఆమె నీతిగానే ప్రవర్తిస్తుంది. ప్రతి వేశ్యకీ 'సమయ మ్మాతృక' ఉండాలని క్షేమేంద్రుడు చెప్పాడట. మధురవాణికికూడా ఒక తల్లి ఉంది. ఈమె లోకంలోని వేశ్యమాతల మచ్చుకాదు. ఆమె చెవినిల్లు కట్టుకొని మధురవాణికి హితోపదేశము చేసింది. "చెడని వారిని చెడగొట్టకూడదు; మంచివారి యెడల మంచిగానూ, చెడ్డవారి యెడల చెడ్డగానూ ఉండ"మనే ఆ ఉపదేశంలోని సారాంశం. ఆ మాటలు మధురవాణి పాటించింది. అయితే నాటకాంతంలో సౌజన్యారావు వంటి సత్పురుషుడు చెడ్డవాని యెడలకూడా మంచిగానే ఉండుమని బోధిస్తే ఆమె ఆ సూత్రాన్ని ఆచరణలో పెట్టదలిచింది. కాని ఆమె మొట్టమొదటి ప్రయత్నానికే లోకం అడ్డు తగిలింది. గిరీశం చెడ్డవాడని ఆమెకి తెలుసు. అతని బండారాన్ని కావాలంటే ఆమె బయటపెట్టగలదు. అయినా చెడ్డవారి యెడల కూడా మంచిగా ఉండడానికి సౌజన్యరావు అడిగినా, గిరీశం గురించి ఆమె చెప్పదు. 'క్షమించండి' అని ఊరుకొంటుంది. "చెప్పవా?" అని అతడు నిష్ఠూరంగా అడుగుతాడు. "తాము చెప్పక తీరదని ఆజ్ఞాపిస్తే దాటగలనా? పాపము, ఆయనను బతకనియ్యండి" అంటుంది. "అతడి బతుకుమాట ఆలోచించుతున్నావు. వీడు అవ్యక్తుడైతే, పాపము ఆ బుచ్చమ్మ బతుకు చెడుతుంది! అది ఆలోచించావు కావు" అని సౌజన్యారావు జ్ఞాపకం చేస్తే మధురవాణి ఆలోచించి ఆ తరువాతే గిరీశంలోని చెడ్డను బయట పెడుతుంది. మంచిగా ప్రవర్తించడానికి కూడా అవధులున్నాయి మరి. లోకం మంచిగాకూడా ఎవరినీ ఉండనివ్వదు కాబోలు.

'మొగాడి కయినా ఆడదాని కయినా నీతి ఉండాలి' అన్న తరువాత మధురవాణి నాటకంలో

మాట్లాడిన రెండవ మాట 'వేశ్య అనగానే అంత చులకనా పంతులుగారూ ?' అన్నది. ఆ జాతిపట్ల, ఆ సమస్యపైన చులకన భావాలు తప్పించడానికే అప్పారావుగారు కన్యాశుల్కములో ప్రయత్నించారు. మధురవాణి జాలిగలజాణ. డబ్బు కక్కుర్తి మనిషి కాదు. అంత మాత్రాన డబ్బు విలువ తెలియనిది కాదు. చెయ్యవలసిన చోట ద్రవ్యాకర్షణ చేస్తుంది. ఇవ్వవలసిన వాళ్ళకి ప్రాణమైన ఇస్తుంది. వేశ్యలని బహిష్కరించాలనే వాళ్ళు ఆ సమస్యని అర్థంచేసుకోలేదని గుర్తించింది. వాళ్ళచేతనే ఒప్పించింది. ఇతరుల కష్టాలను అర్థంచేసుకుంది. తన బాధల్ని ఎప్పుడోగాని బయటపెట్టదు. అందరి సమస్యలనీ పరిష్కరిస్తుంది. తన సమస్యని తాను తప్ప ఇంకెవరూ సంస్కరించలేరని తెలుసుకుందీ. ఆమె నాటకంలో ఒకచోట "లోకం అంతా యేమి స్వప్రయోజకపరులూ !" అని ఆశ్చర్యపోతుంది.

అప్పారావుగారు నాటకమంతటా మానవులలోని స్వార్థాన్నే అర్థంచేసుకొని చిత్రించారు. నాటకం విజయనగరంలో ప్రారంభమవుతుంది. అక్కడ రెండు ముఖ్యపాత్రలు తమ స్వార్థంకోసం ఆవూరు విడిచిపెట్టడంతో కథ ప్రారంభమవుతుంది. ఊళ్ళో ఎక్కడ చూసినా బాకీలే కనుక, పూటకూళ్ళమ్మ ఇంక తిండి పెట్టేటట్టు కనిపించలేదు కాబట్టి ఆ వూళ్ళో ఉంటే ఇంక ఆబోరు దక్కదను కోడంవలన గిరీశం విజయనగరం వదలిపెడతాడు. ఆ ఊళ్ళోని డిప్టీకలక్టరుగారికి మధురవాణిపై ఆగ్రహం వచ్చింది. తన కుమారుడు ఆమెని చేపట్టడమే దానికి కారణం. చదువుపేరుపెట్టి కొడుకుని చెన్నపట్నం తగిలేశాడు. మధురవాణి యింటికి వెళ్ళేవాడల్లా తన కొడుక్కి దోస్తి అయి ఉంటాడని డిప్టీకలక్టరు అనుమానిస్తాడేమోనని పేరుగలవాడెవడూ ఆమె యింటికి వెళ్ళడం మానేశాడు. ఈ సంజీవరావుగారి అల్లరి కొంచెం మరుపొచ్చేదాకా పైనుండాలని మధురవాణి కూడా విజయనగరం వదలిపెడుతుంది.

గిరీశం కృష్ణరాయపురానికి, మధురవాణి రామచంద్రపురానికి వెళ్ళారు. గిరీశం తాను వెళ్ళినచోట పరిస్థితులకి లొంగిపోతాడు. మధురవాణి ఉన్న పరిస్థితులను మార్చేసి, కొత్తవి సృష్టించింది. ఇదే ఇద్దరి పాత్రలలో ఉన్న ముఖ్యమైన తేడా. గిరీశం గాలికోడి. మధురవాణి జీవశక్తి. గిరీశం బుచ్చమ్మలాంటి అమాయకుల్ని తియ్యనిమాటలతో నమ్మించి, వొట్టూ సత్యాలతో బంధించి స్వప్రయోజనం చూసుకొనేవాడే. మధురవాణి మోసగాళ్ళ కన్నుకప్పి మంచివాళ్ళకి సాయంచేయగల సాహసి ; వెన్నపూస. మధురవాణి పాత్ర గురించి విపులమైన పరిశీలన 'పరిశోధన' అనే పత్రికలో ప్రకటించాను.

కన్యాశుల్కం నాటకం గిరీశం మాటలతో మొదలవుతుంది. దానితోనే అంతమవుతుంది. ఇందులో ఒక సాంకేతిక రహస్యం ఉంది. గిరీశం ఆధునిక సమాజానికి చిహ్నం. పాశ్చాత్య నాగరికత తెచ్చిపెట్టుకున్న, అందులోని మంచి ఒంటబట్టని తత్వానికి ప్రతినిధి. అప్పారావుగారు సమకాలిక సంఘాన్ని విమర్శించ దలచుకున్నారు కనుకనే గిరీశాన్ని అంత విపులంగా చిత్రించారు వానికి సమాజంలో వస్తున్న కొత్త మార్పుల పట్ల కొన్ని విశ్వాసాలున్నాయి. 1901 వ సంవత్సరం ఆగస్టు 9 వ తేదీన వారు తమ డైరీలో ఇలా వ్రాసుకున్నారు :

"నిన్న రాత్రి వెంకన్న పంతులుగారు చనిపోయారు. పాశ్చాత్య నాగరికత తెచ్చిపెట్టిన మంచీ చెడూ ద్విగుణీకృతమై ఆయనలో మూర్తీభవించినవి... ఆయనంటే కిట్టనివాళ్లు ఆయనకు గల చెడ్డ గుణాలనే చెబుతారు గాని, ఆయన మంచిని

ఎన్నికచేయరు. ఆయన చెడ్డను గోరంతలు కొండంతలు చేస్తారు. కాని అటువంటి దుర్గుణాలు ప్రస్తుతం మన సమాజంలోవున్న మేధావి వర్గమునకు తప్పని సరిగా ఉండకమానవనే విషయాన్ని వీ రెవరూ గుర్తించడంలేదు. మన మత నమ్మకములు, సాంఘిక అభిప్రాయములు, ఆశయములు, అంతో ఇంతో వ్యక్తిగతజీవితములో నైతిక ప్రమాణమును కలుగజేస్తూనే,. ఇంకొకవంక పారహిత జీవితములో సద్వర్తనమును, నీతినీ కలిగించలేక పోతున్నవి. విద్యాధికులైన భారతీయులపై ఇవి తమ ప్రభావమును నెరపలేకపోతున్నవి. పాశ్చాత్య విద్యా విధానము ముందునకు పోయే గమనశక్తి లేని కేవలము కొన్ని అభిప్రాయములను, ఆశయములను మాత్రమే ఉపదేశిస్తున్నది. సామాజిక, మేధోజీవిత పరిస్థితులను సమన్వయము చేసే శక్తి ఈ పాశ్చాత్య విద్యకు మృగ్యము. పాశ్చాత్య విద్యాజనిత ఆశయముల కిట్టి శక్తి పూజ్యము... పరస్పర వ్యత్యాసము గల విభిన్న సంస్కృతులు రెండింటిమధ్య ప్రస్తుత తరపు జనులు జీవించవలసి వచ్చినది. ఇందులో ఒక నాగరికతకు సూత్రములు కొల్లలుగా వున్నప్పటికీ అవి శిథిలమైనట్టివి. ఈ సంస్కృతి పూర్తిగా చివికి శల్యావశిష్టమైనది... ఇక రెండవదాని విషయము : ముందుకు నడుచుకు పోవుటలో ఇది శక్తివంతమైనది. స్వేచ్ఛాయుతమైనది. ఇది హేతువాదమును ఆకట్టుకొనుచున్నది. పాశ్చాత్య నాగరికత కొన్ని అంధ విశ్వాసాలను పోగొట్టుకొన్న మాట యథార్థమే అయినప్పటికీ, అది ప్రబోధించే స్వాతంత్ర్యము సాంఘిక ప్రగతి శూన్యమైనది. ఇది సంపూర్ణ స్వాతంత్ర్యం కాదు. నామమాత్రమైనది. ఇది అన్యులకు చోటివ్వదు. ఇటువంటి నాగరికత; మనుజులను అవలక్షణములకు, అస్థిరత్వమునకు, దోషములకు గురిచేసి, అక్కడకు తీసుకుపోయి, దిగవిడువక తప్పదు. ఈ అవలక్షణాలను, దోషములను, చెడుగులను, ధోరణిని దిగ్విజయముగ యెదిరించి పోరాడుట నేటి ప్రప్రథమ సమస్య."

ఇంత విపులంగా తాత్త్వికచింతన చేశాకే అప్పారావుగారు గిరీశాన్ని చిట్టచివర గాలిలో వదిలేశారు. అతడు ఆఖరున ఓడిపోయే పిరికిపంద. గిరీశం "ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటి కామాటలాడి...తప్పించుకు తిరుగువాడు" అందుకే ధన్యుడిలా కనబడి ప్రజాహృదయాలలో పాతుకు పోయాడు. అయితే వాస్తవానికి అతడు ఆషాఢభూతి. విజయవంతంగా వంచనచేసేవాళ్ళనీ, తెలివిగా మాట్లాడి నవ్వించి 'తద్రాయి బద్రాయి తాటికాయ' చేసేవాళ్ళనీ లోకం ఎందుచేతనో మెచ్చుకుంటుంది. ఎత్తుపై ఎత్తు వేసే 'రేచుక్క పగటిచుక్కల' కథలూ, మోసగాళ్ళగాథలూ మెచ్చుకొనే లోకంలో గిరీశం హీరో అవడంలో వింతలేదు.

అందుకే అప్పారావుగారే "నేను వొక దోషాన్ని, దుర్నడతను ఆకర్షవంతం చేశానా ?" అని ప్రశ్నించుకొని ఆత్మవిమర్శ చేసుకున్నారు. చేయలేదనే భావించారు. "కన్యాశుల్కం నాటకం పిలువని పేరంటానికి 'మా అప్ప పట్టుచీర కట్టుకొస్తా'నని బయలుదేరి యేదో వొక నైతికోద్దేశాన్ని ప్రత్యక్షంగా బలవంతంగా నెత్తిన రుద్దదు. కాని దానికి ఒక మహత్తరమైన నైతిక ప్రయోజనం వుంది." అని అప్పారావుగారే చెప్పారు.

వారి నైతిక ప్రయోజనం మనుష్యుల మనస్సులను మార్చడం. ఎంత కరడుకట్టిన పాషాణ హృదయంలోనైనా కనికర ముంటుందనే విశ్వాసం అప్పారావుగారి కుంది. కన్యాశుల్కం పుచ్చుకోదలిచిన అగ్నిహోత్రావధాన్లూ, ఇవ్వడానికి సిద్ధ

పడిన లుబ్ధావధాన్లూ ఆ సమస్యకి కారణభూతులు. ఈ ఛాందసు లిద్దరి హృదయాలూ, గడ్డకట్టిన లావాముద్దలు. నాటకాంతానికి రెండూ బీటలు వేస్తాయి. లుబ్ధావధాన్ల శిలాహృదయం లోంచి పరితాపలత పైకొస్తుంది. అగ్నిహోత్రావధాన్ల రాతిగుండెను చీల్చుకొని ఒక గడ్డిపూవు తల ఎత్తుతుంది. బుచ్చమ్మని తలచుకొని "కనికరంగా కేం, కడుపులో యేడుస్తున్నాను కానూ?" అని సౌజన్యరావు ముందర బయటపడిపోతాడు. అయినా ఆ కరుణావేశాన్ని వెంటనే ఇనుపచేతులతో నలిపి వేస్తాడు.

లుబ్ధావధాన్ల పరివర్తన నాటకానికి కావలసినది. ఆ పాత్ర క్రమంగా ఎలా మారుతూ వచ్చినదీ అప్పారావుగారు చూపెట్టారు. తాను పెళ్ళాడిన పిల్ల రెండోపెళ్ళిదని తెలిశాక, దాని మొదటి మొగుడు దయ్యమై పట్టుకున్నాడని భావించి మారడం మొదలుపెడతాడు. సౌజన్యరావుగారి హితోపదేశంతో తన డబ్బంతా వారి పాదాలవద్ద పెట్టి కాశీవాసం చేసుకుందా మనుకుంటాడు. దురాచారాలు మాన్పడానికి రాజమహేంద్రవరంలో నున్న సభకి డబ్బు ఇవ్వాలనుకుంటాడు. ఇంతతో అప్పారావుగారి నైతిక ప్రయోజనం సిద్ధించింది. అయితే వారిలోని సంస్కారాభిలాష కన్నా సాహిత్యశిల్పం కొన్ని 'కొంటె'పనులు చేయించింది. ఇంత మారా డనుకున్న లుబ్ధావధాన్లలో పాతవాసనలు పోలేదని చూపించడమే వారి చాకచక్యానికి నిదర్శనం. గిరీశం కనబడ్డ వెంటనే లుబ్ధావధాన్లు "అయితే అబ్బీ! అగ్నిహోత్రావధాన్లుగాడి కూతుర్ని లేవదీసుకుపోయినావట్రా! వాడికి తగిన శాస్తి చేశావు. దాన్నిగానీ పెళ్ళిమాత్రం ఆడలేదు గద?" అని ప్రశ్నిస్తాడు. ఇటువంటి చిన్న సంభాషణలే కన్యాశుల్కంలోని పాత్రలు సజీవవ్యక్తులని నిరూపిస్తాయి. అందుకే ఆ పాత్రలని మనం ప్రేమిస్తాం. విశ్వమానవప్రేమని మూర్తీభవింప చేయడమే అప్పారావుగారి లక్ష్యం. "ఇదీ ఉత్తమమైన రాజమార్గమని దేనిని బుద్ధుడు మనకు ఉపదేశించాడో, అదే నిజమైన ఉన్నతమైన ప్రేమ! మానవజాతికై మనకు ఉండవలసిన ప్రేమ! ఏనాడు బౌద్ధమతం భారతదేశంలో తుడిచిపెట్టబడిందో ఆనాడే భారతదేశం మత విషయిక ఆత్మహత్య చేసుకుంది" అని అప్పారావుగారు అన్నారు.

కన్యాశుల్కంలో కొత్త మానవత్వం పునర్జన్మ ఎత్తింది. ఆయన ధన్యుడు.

Source: A.P. Press Academy Website

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/